హౌ ఫూలిష్ ఇటీజ్ ఫర్‌మి? మా అహింసా మూర్ఖులు పడక కుర్చీలో పడుకుని గుర్రెట్టి నిద్రపోతున్నారు. లేపనా వద్దా? పప్పులుసు స్లాండింగులో అలావుండిపోతుంటే? బైదిబై లేపెదనుగాక; బిలవ్వుడు గారు బిలవ్వుడుగారూ లేచి కంచంమీదకు కలబడండి. దిఅప్పళమ్స్ చల్లమిరపకాయలు ఎటిస్ట్రా ఆర్ రడీ మిష్టర్;

# ఎంకి బాటిలూ - ఇంకు పాటలూ

ఏవిటి నా ఆలోచనా రాణీ - ఉల్లిపాయలు నలుస్తూ కంటనీరు కారుస్తూ హాట్‌హోమ్‌లో దొంగలా కూర్చున్నావ్ అన్నారు. మావంటింటి మొనగారు(డుకాదు) సరదా కంటె అన్నారుకాని డోంట్ రిపీటిట్ - మీరు ఇంటలెక్చువల్ ఐతే కావచ్చు... ఐడోంట్ కేర్ - నేను వంట లెక్చ్యుయల్ని: నా పనిమనిషి అచ్చమ్మ అంట లెక్చ్యుయల్; దాన్నీ నన్నూ ఏవీ అనడానికి వీల్లేదు. అదిసరేకాని, ఇంకు బాటిలు పట్టుకొచ్చారా అన్నా. స్టాండపాన్ది బెంచి - మీ పొయెట్సుకి పొటాటో చిప్సు పెడితే తింటారుగాని అస్సల్వని చెప్పకూడదు. కొరివితో హెడ్ గోక్కున్నట్లే - హవున్సార్; నాకో డవుటుంది... ఎంకిపాటలు మీ మగాళ్లే ఎందుకు ఎక్కువగాపాడ్డం, లైక్‌చెయ్యడం? అస్తమానూ అష్టపద్స్. తరంగమ్స్, త్యాగరాజ కీర్తన్స్ ఇన్నోటి పాడతారుకాని మా వంట లెక్చ్యుయల్స్ ఈ ఎంకిపాటలెందుకు పాడరు? మంగళహారతులు రాసుకుంటారు కాని, మోడ్రన్ పొయిట్రీ ఎందుకు చదవరు? మా ఆడాళ్ళు ఇంటలెక్చ్యుయల్లీ పూర్ క్రీచర్స్ ....అంటే చిలుకలు పిచికలు హంసలూ నెమిళ్ళూ పావురాలూ... ఆడాళ్ళు వంట లెక్చ్యుయల్సైతే కాపరాలు తిన్నగా చేయజాలరు. మరేంలేదు - పెంపుడుజంతువులకు తిరగబడే స్వభావం పోతుంది. పతివ్రతలు మంచివంట లెక్చ్యుయల్స్‌కాని ఇంట లెక్చ్యుయల్స్ కారు.

ఆడవాళ్ళు ఇంటలెక్చ్యుయల్స్ ఐతే పడకటింటి సౌభాగ్యం చెడిపోతుంది. బెడ్‌రూం లైట్ వెలుగదు. అలాటి హైక్లాస్‌లేడీతో కాపురం పడకగదిలో పెట్రోమాక్సులైటు పెట్టుగున్నట్లుంటుంది. అనుకూలవతి యైనభార్య అనగా - బాగా మచ్చికచేసిన మగువ అని అర్థం. మన దేశంలో మొగుడు చచ్చిన ఆడాళ్ళే మతంమీద, దేవుళ్ళమీద, ఆచారాల మీద అథార్టీలు - వీళ్ళ ధాటికి కొత్తకోడళ్ళు కుర్రదంపతులూ తట్టుకోలేక ఓల్డు ఈజ్ గోల్డు అని దాసోహమంటారు. వంశ ప్రతిష్ఠ, గౌరవం, కులం, డబ్బు, హోదా, అన్నీ వుండాలి. కుర్రాళ్ళకి ఏది మంచి ఏది సుఖం అది వీరికక్కర్లేదు. కట్నాలూ లాంఛనాలూ జరపవలసినవన్నీ జరిపితేనే కాని పిల్లదాని కొంగుగాలి తగలనివ్వరు పిల్లాడికి.

తెలుగుయువకుల రసజ్ఞతా దారిద్ర్యానికి కట్నాలిచ్చుకోలేక ఎదిగి పెళ్ళికాకుండా కూర్చున్న ఆడపిల్లల సహస్రనామాలే సాక్షి. (విత్ అపాలజీస్ టు చాసో). అంతేకాని హోటళ్లలో లాడ్జింగు

హోముల్లో, గుడిసెల్లో, సందుల్లో, గొందుల్లో, రూపాయలు పోసి విలువకట్టి సంపాదించుకున్న శారీరకసుఖంతో తెలుగువారి రసజ్ఞతను కొలవడం సో వెరాబాద్. కమింగ్ టు ఎంకిబాటిల్- దీజ్ మోడ్రన్ లేడీస్ చినిమాసాంగ్స్ పాడతారుకాని ఎంకిపాటలు వారు పాడలేరు. (అవన్నీటా- నీ టెల్గూ నీ ఇంగ్లీషుకన్నా ఘోరంగా వుంది. నీ లాంగ్వేజీ బెడ్రూమ్స్‌లో ఆంధ్రానంతా టూచా తప్పకుండా ఫాలో అవుతున్నారు. పెళ్ళాం మొగుడికి తమలపాకు చిలక లందించినట్లు మాటల్ని విసుర్తున్నారు చిరంజీవి సౌభాగ్య వతులు. తమతమ మొ(న)గాళ్ళమీద టేక్ కేర్ - ఇంప్రూవ్ యువర్ ఇంగ్లీషు-) నేను ఎంకిబాటిల్ ఎందుకు తీసుకురాలేదో చెప్పనా - నువ్వు సిరా మీద ఒలకబోసుకుంటావ్ -

చాలించండి. మీ సొంతగొప్పలు. ఎంకిబాటిల్ మీదపోసుకోడానికి మేమెవరమూ ఆవులంకావు.

నా ఆలోచనారాణీ ఆవులంటున్నావేమిటి? ఒళ్ళు తూల్తోందా - తల తిరుగుతోందా?

నాటిన్ది లీస్టు -

ఆవులనగా మేధావులు, మైడియ్యర్ సార్ (నా ప్రియమైన అయ్యా) వింటున్నారా? ఎవరూ షటప్ అనకుండా మీకు నోరుమూసుకు పోయిందేమి?

ఇందాక బిగినింగులో ఇంకు బాటిలు పట్టుగొచ్చావా అంటే ఎంకి పాటలు పట్టుకొచ్చానంటారేవిటి? ఎవరేనా డాక్టరుగారి దగ్గరికెళ్ళి మందుల్తీసుకోండి. మందంటే - మెడిసిన్ - అదనుకునేరు. అదేవన్నా అయితే శ్లాక్స్ కొనుక్కొచ్చు కోండంటె సాక్స్ కొనుక్కొచ్చుగుంటారు. ఇంకా కొంచెం స్ట్రాంగ్ మెడిసినైతే ఎంకిబాటిలూ ఇంకుపాటలూ అంటారు. బై ది బై

మీరు కేటగారికల్‌గా ఇంటలెక్చవలైతే - నేను భానుమతీ అత్తగారి కల్‌గా వంటలెక్చువల్ని, మరియు స్వామి వినండి. మన అచ్చమ్మ అమ్మగారికల్‌గా అంటలెక్చుయల్. అదీసంగతి ఏం మాట్లాడరు? నన్ను ఆలోచనారాణీ దొంగనాయకమ్మ అటే వూరుకునేది లేదు. వూరుకోను.

నువ్వు నా ఆలోచనలకు రాణివి కనుక నిన్ను నా ఆలోచనారాణీ అనొచ్చు. నువ్వే నా మనస్సును దొంగిలించిన దానివి. నా జీవితకథా నాయికవు గనుక సంసారపక్షంగా దొంగనాయకీ అని ముద్దుగా పిల్చుకుంటే తప్పా?

తప్పా తప్పున్నరా... అరలెందుకే మళ్ళీ అరలు మరలూను - మనమధ్య అరమరలు లేవుకనుక, నేనేవన్నా నువ్వుపడాలి; అఫ్‌కోర్సు నువ్వు పూలరంగడూ, గురుగారూ, వంటింట్లో మొనగాడూ అంటే నేను నోరు మూసుగుకూర్చోటంలా. మనం పది అంటాం పది తింటాం కదే అగ్గిపిల్లా...

అల్లా నాన్సెన్స్ మట్లాడకండి. మీరు అగ్గిపిల్లా అంటే నేను కుక్కపుల్లా అని అనాల్సొస్తుంది. కవితలో అర్థమైన శృంగారం జీవిత కావ్యంలో కాదు వనితకనర్థం. అబ్బ ఈవాళ పొయిట్రీ తాగొచ్చినట్లు మాట్లాడ్తున్నాను. మనస్సును ఎంకిబాటిల్‌లో ముంచి ఇంకుపాటలు రాస్తున్నాను.

శ్రీశ్రీ. చెహోవ్, గోర్కి, మపాసా, విస్సనాశాస్త్రీ ఎవరై తేనేం – మసాళాపెట్టి కూరొండి తెలుగూ పాఠక్స్‌కి హాట్ హాట్‌గా స్వీట్ స్వీట్‌గా వడ్డించేస్తా. ఘాటుకి తెలుగూ పాఠక్సుకి హాట్ హాట్‌గా స్వీట్ స్వీట్‌గా వడ్డించేస్తా. ఘాటుకి తలతిప్పుతోందంటారా..ఐవిల్ సెట్‌రైట్ మీరు ఓల్డు పొయిట్రీ తాగొస్తే నేను మోడ్రన్ ప్రోజ్ పుచ్చుగునొచ్చాను. జగన్మోహిని అపరావటారంలా. నా ప్రోజు జగన్మోహిని కాదు. నావి ఫస్టుక్లాసు కోతలంటారా? అనండి; అనండి; అమృతకలశం అంటే టెల్సా మీకు –(ఎంకిబాటిల్ అన్నమాట) అన్నమాటకాదు – వున్న మాటే. రేపు నాప్రోజునిసిల్వర్ స్క్రీనెక్కిస్తే అందులోంచి మతాబాలు, కాకరపువ్వొత్తులు, చిచ్చుబుడ్లు, జువ్వలు, పెటేపకాయలు, సిసింద్రీలు వ్వాట్ నాట్...మాటలు సెల్యూలాయిడ్ బాటలగుండా పరిగెడతాయి. నాది జెట్ ప్రోజు. నా ఐడియాలు గరంగరం ఒడియాలు – నా మనస్సు రాకెట్లా చంద్రమండలానికి పరిగెడ్తుంది. భూమి చుట్టూ తిరిగినంత మాత్రాన తృప్తిలేదుదానికి. నా హృదయం బ్రాకెట్లో రాకెట్లాటి కొశ్చన్ లున్నాయి. బూజుపట్టిన వూరగాయల్ని, పురుగులు పట్టిన ప్రాత చింత పండునీ, కుళ్ళు బుట్టల్ని, చింకిచేటల్ని, చిల్లుగంపల్ని, మ్యునిసిపాలిటీ వారి చెత్తకుండీలోకి గిరవాటేసినట్లు దొంగమతాల్నీ దొంగదేవుళ్ళనీ పునర్జన్మల్నీ జాతుల్నీ కులాల్నీ డబ్బునీ అహంకారాన్నీ అధికారమదాన్నీ చెత్తకుండీలో నెట్టెయ్యకపోతే, మైడియ్యర్ సర్స్ అండ్ మేడమ్స్; మనవే చెత్తకుండీల్లో అదే భూకైలాసమనుకుంటూ, మురికి కాలవను చూసి అదే గంగా భాగీరథీ సమానమనుకొంటూ కాంట్ బట్‌గా జీవించాల్సొస్తుంది. గతమంతా తడిసె నెత్తురున, కాకుంటే కన్నీళులతో ఐహేట్ లివింగ్ ఇన్ దిపాస్ట్;

ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని అన్నారుగాని కవి అలా పొగడ్డం అట్టే మంచిపనికాదు. మన దేవుళ్ళ లాటి దేవుళ్ళు లేరు. మన మతంలాటి మతంలేదు. మనదేశంలాటి దేశంలేదు, అని కవుస్ (ఆవులుకాదు మేధావులూ కవులూ)అరుస్తోంటే మరి మనదేశం భూతలస్వర్గంగా కాక, భూతాలస్వర్గంగా వుండేమిటి? మట్టిగాకపోతే మనుషలేకదా దేశమంటే – ఈ మనుషులు ఈ భూతాలస్వర్గాన్ని సృష్టిస్తున్నారన్నమాట. మనల్నింత దరిద్రం ఎలా చుట్టుకుంది? మన మనుష్యులిలా మట్టిముద్దల్లా పప్పుదిమ్మక్కల్లా ఎలా తయారయారు?

మనకు పరంమీదవున్న వ్యామోహం (స్వర్గంలోని రంభా ఊర్వశి మేనక ఎట్‌సెట్రాలను సుఖంగా వూహించుకోడంవలన కలిగే మోహం. ఇహంమీద ఇంట్లోని పెళ్ళాం బిడ్డలమీదా యింకా బ్రతికున్న వాళ్ళమీద బ్రతకవలసినవాళ్ళమీద లేకపోవడం గొప్ప ట్రాజిడీ. ట్రాజడీలు జీళ్లు కావుతినడానికి. కాకపోయినా దోసకాయ తరుగుతుంటే చేదు దోసముక్కలువస్తే వంటలెక్చుయల్‌గాపారేసినట్టు, ట్రెడిషన్‌మీద మోహాన్ని పారేయడానికి వల్లకాదు. అలా పారెయ్యని దొంగనాయకమ్మలు, తమ భక్తిరుజూచేసుకోడానికి ఆధ్యాత్మ రామాయణకీర్తనలు పాడి, ఉపవాసాలుండి, మొగుళ్ళను తమ భక్తితో పరమ పవిత్రంగా కాల్చుకు తింటారు. సోషల్ సెక్యూరిటీలేని ఆడాళ్ళకు దైవభక్తి గొప్పవరం. మగాడు కర్మను తిట్టుకోడం మానేసినా, యుగాలు గడిచినా, ఆడాళ్ళు పతిదేవుళ్ళను కౌగిలించుకోడం, కృష్ణలీలలన్నీ తమకే

జరిగాయనుకున్నట్లు ఆనందిస్తూ మధురభక్తి సంప్రదాయంలో కొట్టుకుపోవడం మానరని, ఛాలెంజిచేసి చెప్తాను. అందుకే వంట లెక్చుయల్స్‌కి ఎంకిబాటిలూ ఇంకుపాటలూ అక్కర్లేదు. దే డోంట్ కేర్.

# కాగితపు పల్లకి

**ఖ**మ్మని పూరీలోయ్ బావా కరకర వేపానోయ్ బావా - అంటూ ఏ మరదలు పిల్లేనా మీది మీది కొస్తూంటే మీకెల్లా గుంటుందండీ అని అడిగా - అంటే మరదలు పిల్ల ఒరిజినల్ సెల్ఫ్‌ని టచ్ చేస్తుంది. పెళ్ళాం పర్సుని టచ్ చేస్తుంది అంతే తేడా అన్నారు. అహ్హా అల్లాగా - పెళ్ళాం చూపించని సైడుపోజులు మరదలు చూపెడ్తుంది అంటారనుకున్నా అన్నాన్నేను. సర్టెన్లీ... పెళ్ళాం అమృత వర్షిణి లాగుంటే మరదలు ఆనందభైరవి కాదా - క్కాదు. మరద లంటే మరగకాచిన పాలు, పెళ్ళాం తోడుకున్న పెరుగు.... దట్సాల్; మరి మరదళ్ని మరగకాచిన పాలని ఎందుకన్నారు? మూతిమీసాలు కాల్తాయి గనుక. తెనాలి రామకృష్ణుడి పిల్లికి కాలినట్లు; చాల్లెండి వేళాకోళం.... పెరుగైతే ఎంచక్కా కంచంలో బోర్లించుకుని జుర్రేసుకోవచ్చు. పాపం...పెళ్ళాం మరగకాచిన పాలులా వుండదా... వుంటుందనుకో... అప్పుడు, వూదుకుని మూతిమీసాలు కాలకుండా ట్రయిచెయ్యాలి. అదంతా చాలా కష్టం... పెరుగైతేనే బావుంటుంది.

అందుకా "ఏ మే" అంటూ మేకలా అరుస్తారు. అవును, మేకులా వుంటే మేకలా అరకవ తప్పదు మరి. నో నో - పిలుపులోనే వలపుల్చిలకరించడం మీ మగాళ్ళు నేర్వాలిసార్; అసల్ సీక్రెట్ ఆ వలపుగుబులు గమ్మత్తంతా టోన్‌లోంచే రావాలి. అంతేగాని టముకేసినట్టు "ఇదిగో" "ఒసేయ్" "ఏమేవ్ - పీనుగూ - మొద్దూ" అంటూ ఆడదాన్ని కించపరుస్తూ హీనంగా పిలిస్తే ఈ రోజుల్లో అమ్మాయి లెవరూ వూరుకోరు. వెధవ అథార్టీ - బోడిగొప్పలూ టోన్‌లో పలికించడం. వలపు లొలకించడం కానేరదు.

మొగుణ్ని సింపుల్‌గా "ఏవండీ" అని పిలుస్తేచాలు (అందులో ప్రాణ నాయకా, ప్రాణేశ్వరా, నిజవల్లభా, మానసచిత్తచోరా, ప్రాణప్రియలాంటి సంబోధనలన్నీ వున్నట్లే) ఏవండోయ్ అంటే ఆ - "డోయ్"లోనూ ఏవండీ లోని "వండీ" లోనూ ఆ స్వీట్ టచెస్ అన్నీ వీణమీద వ్రేళ్ళు పలికించినట్లు గొంతుకలో పలికించగల ఆడది మీరు చెప్పినట్లు నిజంగా అమృతవర్షిణే. "గుత్తి వంకాయ కూరోయ్‌బావా" పాటలో మల్లే పిలుపులో వలపులుగుమ్మరించడం మన పడుచువాళ్ళు నేర్వాలి సార్; అంతేగాని "ఒసే" అంటే "ఒరే" అనుకునే సమానత్వం కానీ, "స్వర్ణమంజరీదేవి అంటే భుజంగరాడ్మహాశయా" అంటూ కోతి డైలాగులు వల్లించడం కాని,